సత్యమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ



పూజలందుకున్న సత్యమ్మ దేవత

ముదిగుబ్బ: మండలంలోని సిరిగారిపల్లిలో శనివారం సత్యమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. వేద పండితులు వట్టిపల్లి నరసయ్య శాస్త్రి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వెండి ఆభరణాలు, వివిధ రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆంజనేయస్వామి కల్యాణోత్సవం

పావగడ: సంకాపుర సువర్చలాంజనేయస్వామి దేవాలయంలో సువర్చల సమేత ఆంజనేయ స్వామి కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. పావగడ సర్వధర్మ శరణాలయ ట్రస్టు అధిపతి స్వరూపానందేంద్రస్వామి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

సాక్షి బృందం: పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో శనివారం బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ఆయా ప్రాంతాల్లో ఉన్న ఈద్గా మైదానాలకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేపట్టారు. ఈసందర్భంగా ముస్లిం మతపెద్దలు, ఇమామ్‌లో పండుగ విశిష్టతను తెలియజేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కదిరి ఈద్గా మైదానంలో ముస్లింల సామూహిక ప్రార్థనలు



ధర్మవరం ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బత్తలపల్లి ఈద్గా మైదానంలో ముస్లింల ప్రార్థనలు



తలుపుల ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



పుట్టపర్తిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గాండ్లపెంటలో ముస్లింల సామూహిక ప్రార్థనలు



తనకల్లు ఈద్గా వద్ద బక్రీద్ విశిష్టతను తెలియజేస్తున్న మతపెద్ద

శుభకార్యం



పెడపల్లి పెద్దతండాలో వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి పెద్ద తండాలో శనివారం ఉదయం అశ్వర్థ నాయక్ కుమార్తె విశ్వతేజ బాయి వివాహం రాజశేఖర్ నాయక్‌తో జరిగింది. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. జగరాజుపల్లిలో సర్పంచ్ లక్ష్మీనరసమ్మ, మల్లిరెడ్డి దంపతుల కుమారుడు శరణ్‌కుమార్ రెడ్డి వివాహం సాయిరేఖతో జరిగింది. మాజీ ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ ఏవి రమణారెడ్డి, మోహన్‌నాయక్, ఆనంద్‌నాయక్ తదితర నాయకులు ఉన్నారు.

ఆటో బోల్తా: డ్రైవర్‌కు తీవ్రగాయాలు



గాయపడిన ఆటో డ్రైవర్ శ్రీనివాసులు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై జ్వాలాపురం క్రాస్ వద్ద శనివారం సాయంత్రం ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. కడప నగరానికి చెందిన ఆటో డ్రైవర్ గ్రంధే శ్రీనివాసులు కడప నుంచి అనంతపురానికి ఆటోలో బయలుదేరారు. జ్వాలాపురం క్రాస్ వద్దకు చేరుకోగానే ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రసాయనిక ఎరువులు, మందులకు స్వస్తి పలకాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ మాధవి

తనకల్లు: రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులకు స్వస్తి పలకాలని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి, ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, నూనె విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దురై మురుగన్ సూచించారు. మల్లిరెడ్డిపల్లిలో శనివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా దేశంలోని 700 జిల్లాల్లో రెండు వేల కంటే ఎక్కువ శాస్త్రీయ బృందాలు గ్రామాల్లో పర్యటించి నూతన సాంకేతికతతో పాటు కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ పథకాలపై సమాచారం, నూతన పద్ధతుల వంగడాలు, డ్రోన్ స్ప్రెయింగ్ తదితర అంశాలపై అధ్యయనం చేస్తున్నారన్నారు. తక్కువ మందుల వినియోగంపై పంట దిగుబడి ఆధారపడి ఉంటుందన్నారు. రైతులు తాము సాగు చేసే ప్రతి పంటకు ముందు పచ్చిరొట్ట ఎరువులు వేయడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి నివారణ చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీహరినాయక్, ఆత్మా, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తలుపుల : లాభసాటి వ్యవసాయానికి మార్గనిర్దేశం చేయడమే వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమ ఉద్దేశమని ఏఆర్‌ఎస్ రేకులకుంట సీనియర్ శాస్త్రవేత్త డా జి నారాయణస్వామి, రెడ్డిపల్లి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధ అన్నారు. పులిగుండ్లపల్లి, ఉడమలకుర్తి గ్రామాల్లో హెచ్‌ఓ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కార్యక్రమం జరగింది. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు పంటల సాగులో నూతన పద్ధతులు ఏఏ వంగడాల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. మామిడి, వేరుశనగ పంటల్లో యాజమాన్య పద్ధతులను వివరించారు. వీఏఏలు ప్రసాద్, దినేష్, స్వరూప, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆటో - ద్విచక్ర వాహనం ఢీ

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో పావగడ - పెనుకొండ ప్రధాన రహదారిపై శనివారం ఆటో - ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఓ వ్యక్తికి గాయాలైనట్లు గ్రామస్తులు చెప్పారు. మండల పరిధిలోని బీదానిపల్లికి చెందిన కురుబ సంజీవప్ప సంతలో సరుకుల కోసం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఆటో - బైక్ ఢీ కొన్నాయన్నారు. గాయపడిన సంజీవప్పను ప్రైవేట్ వాహనంలో పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

బాబురెడ్డికి ఘన నివాళి

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త బాబురెడ్డి అంత్యక్రియలు శనివారం ఆయన స్వగ్రామమైన చలాపల్లిలో నిర్వహించారు. ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు మాలగుండ్ల శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, చిత్తూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చవ్వా రాజశేఖర్‌రెడ్డి, యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్, హిందూపురం సమన్వయకర్త దీపిక, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ మాజీ డైరెక్టర్ ఓబిరెడ్డి, నాయకులు చరణ్‌రెడ్డి, మధుమతి, మండల కన్వీనర్లు గజేంద్ర, సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు అశోక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు బాబురెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రసాయనాల వాడకం తగ్గించాలి

గుడిబండ: పంటసాగులో రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త బాలాజీనాయక్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రాళ్లపల్లి రైతు సేవా కేంద్రంలో రైతులతో కలిసి వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటసాగులో నూతన వంగడాలను ప్రోత్సహించాలన్నారు.



ఎడ్యుకేషన్ హబ్‌గా కదిరి



కదిరి అర్బన్: కదిరి ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్‌గా మారిపోయింది. ఇక్కడ కేజీ నుంచి పీజీ వరకు చాలా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో వేల సంఖ్యలో విద్యార్థులు చదువుకుంటున్నారు. శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీకి అనుబంధంగా కదిరి ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ సెంటర్ కూడా నిర్వహిస్తున్నారు. పీజీ చేసేందుకు గతంలో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు. ఆ పరిస్థితి లేకుండా కదిరిలోనే పీజీ కళాశాల ఏర్పాటైంది. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లీడ్ కాలేజీగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం కళాశాల నాక్ బీప్లస్ గుర్తింపు పొందింది. ఇక్కడ స్కిల్ హబ్ కూడా ఏర్పాటు చేశారు. కళాశాలలో తరచూ జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. వృత్తి విద్యాకోర్సులు సైతం ఈ ప్రాంతంలో ఉన్నాయి. డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, జెడ్పీగరల్స్ హైస్కూల్, బాయ్స్ హైస్కూల్‌లో ఎంతో మంది విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వందల సంఖ్యలో విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటితో పాటు వాల్మీకీ, బ్లూమూన్, జైన్, హరీష్, చైతన్య, నారాయణ, సాధన, షిర్డీసాయి, శాంతినికేతన్ తదితర పాఠశాలలు విద్యనందిస్తున్నాయి.

తాత్కాలిక సీనియారిటీ జాబితాలోని లోపాలు సవరించాలి



డీఈఓకు వినతి అందిస్తున్న డీటీఎఫ్ నాయకులు

ఓడీచెరువు: ఇటీవల విడుదల చేసిన ఎస్టీటీ ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాలోని లోపాలను సవరించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జార్జి, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు గౌస్‌లాజమ్ అధికారులను కోరారు. ఈమేరకు శనివారం వారు అనంతపురం జిల్లా డీఈఓ ప్రసాద్‌బాబు, ఆర్జేడీ శామ్యూల్‌కు వినతి పత్రం అందజేశారు. కొంతమంది ఉపాధ్యాయులకు సీలింగ్ పాయింట్ల కన్నా ఎక్కువ నమోదు చేశారన్నారు. అవివాహితుల పాయింట్లు లాంటి సమస్యల పరిష్కారం అనంతరం తుది జాబితా విడుదల చేయాలని కోరారు.

ప్రతిభా అవార్డులకు ఎంపిక



పూజిత



జస్మిత

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని వాల్మీకీ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులు సీ. పూజిత, జస్మిత రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసే ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. పాఠశాల విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికకావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ అనిల్ కుమార్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ధర్మవరం క్రీడాకారిణి



జెన్నె గోపిచందన

ధర్మవరం అర్బన్: జిల్లా క్రికెట్ జట్టుకి ధర్మవరం క్రీడాకారిణి ఎంపికైనట్లు ఆర్డీటీ క్రికెట్ కోచ్ రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో శనివారం క్రీడాకారిణిని అభినందించారు. క్రీడాకారిణి జెన్నె గోపి చందన అండర్-15 బాలికల విభాగంలో నెల్లూరులో ఈనెల 9 నుంచి 15 వరకు జరిగే జిల్లా క్రికెట్ టోర్నీకి అనంతపురం క్రికెట్ జట్టు తరఫున ఎంపికైంది. ఆర్డీటీ ఉచిత కోచింగ్ సెంటర్లు పెట్టడం వల్ల ప్రతిభ ఉన్న ప్రతి క్రీడాకారులకు అవకాశం దక్కుతోందని కోచ్ తెలిపారు. బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు క్రీడాకారిణిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీటీ హాకీ కోచ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.